# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 19-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సార్వత్రిక ఎన్నికల తొలి విడతలో 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది.**

2. **యువత, తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకునే వారు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు.**

3. **శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను ఈనెల 24వ తేదీలోగా పరిష్కరించి తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు.**

4. **ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకు 24 వేల 385 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు.**

5. **ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం సింహాచలంలో కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి రథోత్సవం, వార్షిక కల్యాణోత్సవం ఈ రోజు జరగనుంది.**

==========================

సార్వత్రిక ఎన్నికల తొలి విడతలో 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో యువత, తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకునే వారు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. లోక్‌సభకు ఎన్నికలు ఈ రోజు ప్రారంభమయ్యాయని.. వివిధ నియోజకవర్గాల్లో ఓటు వేసే వారందరూ తమ ఓటు హక్కును రికార్డు సంఖ్యలో వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువత, మొదటిసారి ఓటర్లు తప్పకుండా ఓటు వేయాలని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు.

--------------------------

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఈరోజు జరుగుతున్న తొలి దశ పోలింగ్‌లో 8 కోట్ల 40 లక్షల మంది పురుషులు, 8కోట్ల 23లక్షల మంది మహిళలు, 11వేల 371 ఇతరులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ ప్రారంభం అయిన కొద్ది సేపటికే దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఉదయం 11 గంటల వరకు తమిళనాడులో 23.72 శాతం పోలింగ్ నమోదైంది. అండమాన్ నికోబార్‌లో 21.82, అరుణాచల్‌ప్రదేశ్‌లో 18.26, అసోం 27.22, బిహార్ 20.42, ఛత్తీస్‌గఢ్ 28.12, జమ్ముకశ్మీర్

22.60, లక్షద్వీప్ 16.33 శాతం ఓటింగ్ నమోదైంది. మధ్యప్రదేశ్‌లో 30.46, మహారాష్ట్ర 19.17, మణిపూర్ 28.19, మేఘాలయ 31.65, మిజోరం 26.56, నాగాలాండ్ 22.82, పుదుచ్చేరి 27.63, రాజస్థాన్ 22.51, సిక్కిం 21.20, త్రిపుర 33.86, ఉత్తర్‌ప్రదేశ్ 25.20, ఉత్తరాఖండ్ 24.83, బంగాల్ 33.56 పోలింగ్ శాతం నమోదైంది.

---------------------------

వై. ఎస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈరోజు తూర్పు గోదావరి జిల్లా ఎస్.టి. రాజపురం నుంచి ప్రారంభమైంది. ఈరోజు కాకినాడ జిల్లాలో యాత్ర ప్రవేశించనుంది. సాయంత్రం కాకినాడ అచ్చంపేట జంక్షన్‌లో జరిగే బహిరంగ సభలో జగన్మోహన్ రెడ్డి పాల్గొని, ప్రసంగిస్తారు.

---------------------------

ప్రజాగళం యాత్రలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు కర్నూలు జిల్లా, ఆలూరులో పర్యటించనున్నారు. ఆలూరులో మధ్యాహ్నం జరిగే ప్రజాగళం సభలో ఆయన పాల్గొంటారు. కాగా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ రోజు కర్నూలు జిల్లాలో న్యాయ యాత్ర నిర్వహించనున్నారు. ఆలూరులో ఈ ఉదయం ఆమె కాంగ్రెస్ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు ఆదోనిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో షర్మిల ప్రసంగిస్తారు. ఆరు గంటలకు ఎమ్మిగనూరులో బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం షర్మిల కడపకు బయలుదేరి వెళతారు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను ఈనెల 24వ తేదీలోగా పరిష్కరించి తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిన్న ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 20 లక్షల 53 వేల 397 మంది ఓటర్లుగా నమోదయ్యారని, ఈనెల 14తో నూతన ఓటు నమోదు గడువు ముగిసిందని తెలిపారు. ఓటు నమోదు కోసం వచ్చిన ఫారం-6, ఓట్ల బదిలీ కోసం వచ్చిన ఫారం-8 దరఖాస్తులను పరిష్కరించి ఈనెల 24లోగా తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకు 2 వేల 38 మంది రైతులకు చెందిన 24 వేల 385 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించిననాటినుంచి ఇంతవరకు 5 వేల 497 మంది రైతులకు చెందిన 50 వేల 878 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించేందుకు నమోదు చేసుకున్నారని చెప్పారు. తేమ శాతం ,ఇతర నాణ్యతా ప్రమాణాలకు లోబడివున్న ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన 67 లక్షలకు పైగా గోనె సంచులు, 2 వందలకు

పైగా జిపిఎస్ పరికరం రవాణా వాహనం సమకూర్చామని తెలిపారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిమిత్తం మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామని జాయింట్ కలెక్టర్ వివరించారు.

---------------------------

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, సింహాచలంలో కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి రథోత్సవం, వార్షిక కల్యాణోత్సవం ఈ రోజు ఘనంగా జరగనుంది. అన్ని శాఖల సమన్వయంతో వైభవంగా నిర్వహిస్తామని సింహాచలం దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. రథోత్సవం, కల్యాణోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. రాత్రి 8 గంటల 30 నిమిషాల నుంచి రథోత్సవం, 10 గంటల 30 నిమిషాల నుంచి వార్షిక కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు చేశామని ఈవో వెల్లడించారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికలకు ముందు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో భారీగా మావోయిస్టులు చనిపోవడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దింపారు. సరిహద్దు ప్రాంతాలన్నింటిపై నిఘా పెట్టారు. పెద్ద ఎత్తున గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ బలగాలతో గాలింపు చర్యలు నిర్వహిస్తున్నారు. ఒడిశా పోలీసులు, నిఘా విభాగం అధికారులతో సమన్వయం చేసుకుంటూ అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు మావోయిస్టుల కదలికలపై దృష్టి సారించారు.జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న 30 పోలింగ్ కేంద్రాలను సమీప గ్రామాలకు మార్చడానికి ఎన్నికల సంఘం అనుమతి తీసుకున్నామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

---------------------------

రానున్న ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తిరుపతి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ క్రిష్ణకాంత్ పటేల్ సూచించారు. తిరుపతి నగరంలోని అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గోవిందనగర్, ఎస్.ఎల్.వి.నగర్‌లో ఈరోజు ఉదయం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎస్పీ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతులో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ఓటర్లను చైతన్యవంతులను చేస్తూ కేంద్ర సాయుధ బలగాలతో కవాతును నిర్వహించామని తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనకు గురికావలసిన అవసరం లేదని.. తిరుపతి జిల్లా పరిధిలోని 49 రౌడీషీటర్ల నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని.. అలాగే వారిని బైండోవర్ కూడా చేస్తున్నామని కృష్ణకాంత్ పటేల్ వెల్లడించారు.

---------------------------

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పల్నాడు పోలీసు సూపరింటెండెంట్ బిందుమాధవ్ ప్రజలకు సూచించారు. నాదెండ్ల, సాతులూరు, కనపర్రు, చిరుమామిళ్ల, చందవరం, అమీన్‌సాహెబ్ పాలెం లోని పోలింగ్ కేంద్రాలను ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ పోలింగు కేంద్రాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతి భద్రతలకు తీసు కోవాల్సిన చర్యలను పోలీసు అధికారులకు వివరించారు.

---------------------------

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 33 జాతీయ రహదారులను నగదీకరణ మానిటైజేషన్ చేసేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ ఎన్. హెచ్. ఏ. ఐ. గుర్తించింది. ఈ రహదారుల పొడవు సుమారు 2 వేల 741 కిలోమీటర్లు ఉంది. వీటిని టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ –టీ.ఓ.టీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ – ఇన్విట్ పద్ధతుల్లో అప్పగిస్తారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా తమిళనాడు, బిహార్ రాష్ట్రాల్లో నగదీకరణ చేయాలని నిర్ణయించిన రహదారులు వున్నాయి. 2023–24లో వివిధ పద్ధతుల్లో రహదారుల నగదీకరణ ద్వారా 28 వేల 868 కోట్లరూపాయలు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 40 వేల 314 కోట్లను ఎన్. హెచ్. ఏ. ఐ. సమీకరించింది.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన జూలై నెల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం.. టిటిడి తెలిపింది. వర్చువల్ సేవలు, దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు.. శ్రీవాణి ట్రస్టు టికెట్ల కోటాను అదే రోజు ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.

=======================